డిస్టెన్స్ బిఇడి విద్యార్థుల ఆత్మీయ సభ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

బిఇడి 2020 - 22 దూరవిద్యా విద్యార్థులు వారి బ్యాచ్ ముగింపు సందర్భంగా ఆత్మీయ సభను స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సభకు పరీక్షలు , మూల్యాంకన విభాగ సంచాలకులు ప్రొఫెసర్ జి. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తులలో కన్నా ఉన్నతమైనదని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విధిగా ప్రతి విద్యార్థిని ఉన్నతంగా మార్చాలని సూచించారు. దూరవిద్యా సంచాలకులు ప్రొఫెసర్ మునినారాయణప్ప మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో నిజాయితీగా ఉపాధ్యాయ వృత్తిని క్రమశిక్షణతో కొనసాగించాలని కోరారు. గౌరవ అతిథి బిఇడి కళాశాల పిన్సిపల్ సదాశివారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు చిత్తశుద్ధితో ఉపాధ్యాయ వృత్తి, చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శకుంతల, డాక్టర్ అనిత, డాక్టర్ సంజీవ రాయుడు, డాక్టర్ రాముడు, సాల్మన్ రాజు, భాస్కర్, దూరవిద్య బిఇడి విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున కలెక్టర్ గౌతమి

ప్రతి గ్రామంలో కో - ఆపరేటివ్ సొసైటీ

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ కోపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా కోపరేటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు అయ్యాయా లేదా చూడాలని, ఏర్పాటు కాని గ్రామాల్లో సొసైటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సొసైటీలను బలోపేతం చేయాలన్నారు. సొసైటీలలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా చూడాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కూడా ప్రతి గ్రామంలోనూ ఉండేలా చూడాలన్నారు. ఎంపిఎఫ్సి (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్లకు సంబంధించి జిల్లాలో మొదటి దశలో 84 గోడౌన్లు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటివరకు మూడు మాత్రమే పూర్తయ్యాయని, వీటి నిర్మాణం వేగవంతం చేయాలని అన్నారు. రెండవ విడత ఎంపిఎఫ్సి గోడౌన్ల ఏర్పాటుకు సంబంధించి టెండర్లు పిలిచారని, త్వరలో నిర్మాణాల పక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిసిఒ ప్రభాకర్ రెడ్డి, ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్ శాంతి, పిఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం, డిపిఒ ప్రభాకర్ పాల్గొన్నారు.

వేతనాలివ్వకుంటే ఎలా బతకాలి..

కమిషనర్ ఛాంబర్ ముందు గార్బేజ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే తాము ఎలా బతకాలని గార్బేజీ కార్మికులు నిలదీశారు. బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో గార్బేజ్ కోవిడ్, మలేరియా, కార్మికులు నగరంలోని కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ గార్బేజ్ కార్మికులకు ఐదు నెలలుగా బకాయి ఉన్న జీతాలు, మలేరియా కార్మికులకు మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలు, కోవిడ్ కార్మికులకు రెండు నెలలుగా బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలు పట్టించుకోకపోగా మభ్య పెట్టే విధంగా మాట్లాడటం తగదన్నారు. తమ ప్రాణాల సైతం లెక్కజేయకుండా అనంతపురం మురికినంత శుభ్రం చేస్తూ, మలమూత్రాలు ఎత్తేస్తూ, మోరీల కింద దూరి పూడిక తీస్తూ పరిశుభ్రతకు పాటుపడుతున్నారన్నారు. అలాంటి కార్మికులకు ఐదు నెలలగా జీతాలు చెల్లించకుంటే ఎలా అని ప్రశ్నించారు. కార్మికులపై ఉన్నతాధికారులు మొండి వైఖరిగా వ్యవహరిస్తే మున్సిపల్ ఆఫీస్ ముందు టెంటు వేసుకుని కూర్చుంటామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన కమిషనర్ వీలైనంత త్వరగా కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకూ ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. తర్వాత కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉన్నతాధికారులతో, ఎగ్జామినర్తో మాట్లాడి శుక్రవారం వేతనాలను కార్మికుల ఖాతాలకు జమ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు ఆదినారాయణ, నాగేంద్ర, చలపతి, కుళ్లాయప్ప, రాఘవేంద్ర, వీరికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎం.నల్లప్ప, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు, నాయకులు

వామ్మో.. జూన్

ఆనెల వస్తేనే పేద, మధ్యతరగతి కుటుంబాల్లోగుబులు

కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల దోపిడీ.. డొనేషన్ల వాత

విద్యార్థుల తల్లిదండ్రులపై లక్షల్లో భారం

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. 11 నెలల పాటు ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చిన పేద, మధ్యతరగతి కుటుంబాలు జూన్నెల వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. అమ్మో.. జూన్ అంటూ నోరెళ్లబెడుతున్నారు. నెలరోజులపాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలపై కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, వారి తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఆలోచన చేస్తున్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి-హిందూపురం

జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే. స్కూళ్ల ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. వీటిపై నియంత్రణ అనేది లేకపోవడంతో ఈసారి స్పెషల్ ఎఫెక్ట్ అన్నట్లు ఫీజుల భారం రెట్టింపు అయింది. పనిలోపనిగా వైసీపీ సర్కారు సామాన్యులకు షాకుల మీద షాకులిస్తోంది. ఈ నెలలోనే అన్నింటినీ పెంచేసింది. కరెంటు బిల్లులను పెంచేసి ట్రిబుల్ భారం వేసింది. అటు ఆస్తిపన్ను పెంపుతో పాటు ఇటు ఇంటి అద్దెలు పెరిగాయి. ఆపై నిత్యావసర ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబానికి ఈ నెలలో సుమారు లక్షలకుపైనే ఖర్చు వచ్చిపడటంతో చాలీచాలని వేతనాలతో, పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈనెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలలు పున : ప్రారంభం కావడంతో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు దోపిడీ పర్వానికి తెరతీశాయి. పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కుల ధరలను పెంచి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెప్తున్నా బేఖాతరు చేస్తున్నాయి. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రయివేటు యాజమాన్యాలు అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల వసూళ్లు చేస్తున్న సొమ్ము భారీగా ఉండడంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు నలిగిపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు దాదాపు 1995, ప్రాథమికోన్నత పాఠశాలలు 469, ఉన్నత పాఠశాలలు 589 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలలు దాదాపు 450కు పైగా ఉన్నాయి. వీటితో పాటు ప్రయివేటు అన్ఎయిడెడ్, సిబిఎస్ఇ సిలబస్తో నడుస్తున్న ప్రయివేటు అన్ ఎయిడెడ్ 15 ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో కలిపి దాదాపు 3,90,859 విద్యార్థులు చదువుతున్నారు.

భారీగా డొనేషన్లు

ఎండల ప్రభావం కారణంగా వారంరోజుల పాటు ఒంటిపూట బడులు పెట్టినా ఆ తర్వాత పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటి ప్రచారానికి తెరలేపాయి. తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ టోక్నో...ఈ టెక్నోల పేరుతో క్యాంపెయిన్ ముమ్మరం చేశాయి. ఇదిలా ఉంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణాల్లోని స్కూళ్లను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ డొనేషన్లు, ఫీజుల మోత విని భయపడుతున్నారు. యూకేజీ, ఎల్కేజీ స్థాయిలోనే వేలాది రూపాయల ఫీజులతో పాటు అధికమొత్తంలో డోనేషన్లు చెబుతుండటంతో వెనక్కి తగ్గుతున్న పరిస్థితి ఏర్పడింది.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకు మోతే

పాఠశాలలు పున్ణప్రారంభం అవుతున్నాయంటే తల్లిదండ్రులకు గుర్తుచ్చేది ఫీజులు, పుస్తకాలే. ముఖ్యంగా స్కూలులో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్బుక్కులతోపాటు, వాటిని భద్రపరుచుకునేందుకు భారీ బ్యాగులు, దానికి తోడు లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్. ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువుల కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులు కావాల్సిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన దుకాణంలో కొనుక్కునేవారు. అయితే ఇపుడు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పంథా మారింది.పుస్తకాలు, బెల్టు, టై, యూనిఫాం అన్నీ ఆయా పాఠశాల్లోనే కొనాల్సిన పరిస్థితి. దీంతో పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఆర్థికభారం, మరోవైపు పిల్లాడి భవిష్యత్ దీంతో మౌనంగానే ముందడుగు వేస్తున్నారు. అడ్మిషన్ నుంచి తరగతి గదిలో అడుగు పెట్టేంత వరకు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైపోతోందని చెప్పవచ్చు.

ఒక్కో కుటుంబంపై లక్షలాది రూపాయల భారం

ఒకవైపు నిత్యావసర సరుకులు, వివిధ ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయాయి. దీంతో ఏ నెలకానెల ఆదాయ, వ్యయాలపై ఆచితూచి అడుగులు వేస్తున్న వారిలో వేతనజీవులు, చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు ఉన్నారు. అయితే విద్య విషయంలో పెరిగిన అవగాహన నేపథ్యంలో అందరూ పిల్లలను ఉన్నతంగా చదివించాలనే తలంపుతో ఉన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ రోజుల్లోనే పట్టణంలోని ఒక చిన్న కుటుంబం ఇంటి అవసరాలకు రూ.25 నుంచి రూ.30వేల వరకు ఖర్చవుతుండగా, ఈ నెలలో ఇంటి అవసరాలు పక్కనపెడితే కేవలం పిల్లల స్కూలు కోసం ఒక్కొక్కరికీ రూ.50వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తుంది. అయితే ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఇక అంతే. జూన్లో లక్ష రూపాయలకు పైనే ఖర్చు అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇకపోతే పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లలో అంతకు రెట్టింపు ఆందోళన ఉంది. ఇంటర్ ఏ కాలేజిలో చేర్చాలి, డే స్కాలర్నా, హాస్టల్లోనా అనే ఆలోచనలు మెదలుతుంటాయి. దీంతోపాటు ఆయా కాలేజీల గుర్తింపును బట్టి విద్యార్థికి అక్షరాల లక్షరూపాయలపైనే ఖర్చవుతోంది. మరోవైపు ఈనెలలోనే సర్కారు మూడు రెట్లు కరెంటు బిల్లుల మోత మోగించడంతో సామన్యుడి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంకోవైపు నిత్యావసర సరకుల ధరలు, కూరగాయల ధరల పెరుగుదలతో జూన్ మాసం, పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఓ వణుకు పుట్టిస్తోంది.

ప్రైవేటు విద్యాసంస్థలకు విద్యాశాఖ దాసోహం

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ దాసోహమైంది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇప్పటికే ఫీజులకు, పుస్తకాల అమ్మకాలపై ఆందోళన కార్యక్రమం నిర్వహించాం. అయినప్పటికి విద్యాశాఖ అధికారులు డబ్బుకు అమ్ముడుపోయి పట్టించుకోవడం లేదు. పాఠశాలలు తెరవగానే ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు అడ్డగోలుగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. పుస్తకాలు, నోట్ బుక్స్ను అధిక ధరలకు అమ్ముతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎటువంటి అమ్మకాలు చేపట్టకూడదు. అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

బాబావలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు

ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులపై పిల్లల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఫలానా స్కూల్లో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని లిఖితపూర్వకంగా రాసిస్తే చర్యలు చేపడతాం. ఫీజుల వివరాలకు సంబంధించి స్కూళ్లలో తప్పనిసరిగా బోర్డులు ప్రదర్శించాలి. పాఠశాల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.

రంగస్వామి

ఇన్ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి

ఎస్ఎస్ఎ పోస్టుల కౌన్సిలింగ్ ఆపాల్సిందే..

కౌన్సిలింగ్ను అడ్డుకున్న సిఐటియు నాయకులు

ఉద్రిక్తతల నడుమ నాయకులు అరెస్ట్, విడుదల

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ కోసం చేపడుతున్న కౌన్సిలింగ్ తక్షణమే ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య డిమాండ్ చేశారు. గెస్ట్ ఫ్యాకల్టీని తొలగించి కొత్త నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్ట్ పోస్టులు భర్తీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గెస్ట్ ఫ్యాకల్టీలు సర్వశిక్ష అభియాన్ కార్యాలయం వద్ద చేపడుతున్న ఆందోళనలు గురువారానికి రెండవ రోజుకు చేరుకున్నాయి. వీరికి మద్దతుగా సిఐటియు హాజరైన సిఐటియు నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని అయితే ఉన్న గెస్ట్ఫ్యాకల్టీని తొలగిస్తామంటే సహించేది లేదన్నారు. ఉన్న ఉద్యోగాలు తొలగించకుండా వారిని కొనసాగిస్తూ మిగిలిన పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలా కాదని 8 సంవత్సరాలుగా పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించి కొత్త వారికి ఉద్యోగాలు కల్పించామని గొప్పలు చెప్పుకోవడానికి ప్రభుత్వం యత్నించడం అన్యాయంగా ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో కొందరు తప్పుడు అనుభవ పత్రాలు సమర్పించి పోస్టులు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. పని చేస్తున్న వారికి అన్యాయం చేసి ఇలాంటి దొడ్డి దారిన తప్పుడు సర్వీస్ పత్రాలు సృష్టించే వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. వెంటనే నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. 250 గెస్ట్ ఫ్యాకల్టీలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. వారిని వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ ఆపాలని డిమాండ్ చేశారు. అయితే అధికారులు మాత్రం కౌన్సిలింగ్ ఆపకుండా నిర్వహిస్తుండగా సిఐటియు నేతలు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, రజిత తదితరులు ఉన్నారు.

సర్వశిక్ష అభియాన్ కార్యాలయం వద్ద ఆందోళకు దిగిన గెస్ట్ ఫ్యాకల్టీలు, నాయకులు

ముున్సిపల్ శాఖ డైరెక్టర్కు వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ రెగ్యులర్, ఔట్సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ పి.కోటేశ్వరరావుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కిందన్నారు. అంతేగాకుండా సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సిఎం హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్,-సెమిస్కిల్డ్, రిస్క్, హెల్త్ అలవెన్స్ అమలు చేయకుండా కేవలం కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులర్ చేస్తామనడం సమంజసం కాదన్నారు. దశాబ్దాల తరబడి మున్సిపల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో బతుకులు ఈడుస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ కార్మికులతోపాటు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు సోమయ్య, ముత్యాలరావు, కోశాధికారి జ్యోతిబసు, పెంచల నరసయ్య, ఎన్వై.నాయుడు, నాగేంద్రబాబు, వరికూటి రాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న విసి, ఇతర అధికారులు

ఇంజనీరింగ్ కాలేజీలకు నిజానిర్ధారణ కమిటీలు

జెఎన్టియు విసి రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్టియు పరిధిలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాల పరిశీలనకు వర్శిటీ నుంచి నిజానిర్ధారణ కమిటీలు త్వరలో వెళ్లనున్నట్లు జెఎన్టియు విసి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. ఉపకులపతి అధ్యక్షతన వర్శిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు అనంతపురం, పులివెందుల, కలికిరి జెఎన్టియు కళాశాలల అధ్యాపకులతో ఆన్లైన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈసందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ నిజనిర్ధారణ కమిటీలు ముఖ్యంగా కళాశాలలోని ప్రయోగశాలలను, తరగతి గదులను, ఇతర సదుపాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అలాగే కళాశాలలో విద్యార్థులు సంఖ్య ఆధారంగా అధ్యాపకుల నిష్పత్తిని, అధ్యాపకుల అర్హతను పరిశీలించాలన్నారు. విద్యార్థుల, కంప్యూటర్ల నిష్పత్తిని, ఈ సంవత్సరానికి అదనపు కోర్సులకు సంబంధించిన సరైన సదుపాయాలను కూడా తనిఖీ చెయాలని తెలిపారు. ముఖ్యంగా కళాశాలలు అటానమస్, పర్మినెంట్ అఫిలియేషన్కు వెళుతున్నాయని, అయితే పర్మినెంట్ అఫిలియేషన్కు వెళ్లే కళాశాలలో తప్పని సరిగా సెల్ఫ్ అసెస్ మెంట్ రిపోర్టును తనిఖీ చెయాలని చెప్పారు. ప్రతి కళాశాలలో ఖచ్చితంగా ఎఐసిటిఇ, యుజిసి నిబంధనలు పాటిస్తున్నది లేనిది కమిటీలు పరిశీలించాలని తెలిపారు. ఇంటర్నెట్ సౌకర్యం, ఒరిజినల్ లైసెన్స్ సాఫ్ట్వేర్లు, జనరేటర్ సౌకర్యం, క్రీడా సౌకర్యాలను పరిశీలించాలన్నారు. ఇండస్ట్రియల్ ఇంటర్న్షిప్, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ సమాచారాన్ని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ నుంచి తీసుకోవాలని సూచించారు. అధ్యాపకులు తమ కళాశాలలో ఎన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నారో సంబంధిత ఫారం-16 ను తనిఖీ చెయ్యాలని ఉపకులపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య విజయ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఆచార్య ఎ.సురేష్ బాబు, వర్శిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య ఇ. కేశవ రెడ్డి , ఆచార్యులు వి. సుమలత, బి. ఈశ్వర్ రెడ్డి, దుర్గా ప్రసాద్, సుబ్బారెడ్డి, ఆర్. కిరణ్మయి, పద్మ సువర్ణ, భువన విజయ తదితరులు పాల్గొన్నారు

'జగనన్న సురక్ష'ను పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒఆర్డిలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు సిఎం జగన్ 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సిఎం జగన్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మండల స్పెషల్ ఆఫీసర్లు ఖచ్చితంగా మండలాన్ని విజిట్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై శిక్షణ ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లినప్పుడు అనేక రకాల సమస్యలు వస్తాయని, వాటిని ఎలా పరిష్కరించాలి అనేదానిపై దృష్టి సారించాలన్నారు. ముందుగానే పక్కాగా ప్రణాళిక వేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంపిడిఒల టీం, తహశీల్దార్ టీం, మున్సిపల్ కమిషనర్ల టీం ఏర్పాటు చేసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో ఒక్క ఇల్లు మిస్ కాకుండా చూడాలని, వాలంటీర్లు 100 శాతం ఇంటింటికి వెళ్ళాలన్నారు. ప్రతి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయ్యే వరకు కంట్రోల్ రూమ్ ఉండాలన్నారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లడం, రిజిస్ట్రేషన్లు చేయడం, ఏరోజుకారోజు డేటా ఇచ్చేలా చూడాలన్నారు. డాక్యుమెంట్లు కరెక్ట్గా ఉంటేనే సర్వీస్ రిక్వెస్ట్రైజ్ చేయాలన్నారు. ముందుగానే అన్ని డాక్యుమెంట్లను ప్రాపర్గా స్క్రూటినీ చేసుకోవాలన్నారు. ఈ విషయం అందరికీ అర్థమయ్యేలా చెప్పాలన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లోనూ నెట్ కనెక్టివిటీ ఉందా లేదా అనేది ఎంపీడీవోలు పరిశీలన చేయాలన్నారు. ఏర్పాటు చేస్తున్న జగనన్న సురక్ష క్యాంపుల్లో వెలుతురు, తాగునీరు ఉన్నాయా.. లేదా చూసుకోవాలన్నారు. నెల రోజులపాటు జిల్లాలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కేతన్గార్గ్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నెల రోజుల యాక్టివిటీ అని, పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో నాలుగు టీంలు ఏర్పాటు చేయాలని, అందులో లాజిస్టిక్ టీమ్ ఒకటి, రిజిస్ట్రేషన్ డెస్క్ ఒకటి, వెరిఫికేషన్ టీమ్ ఒకటి, జగనన్నకు చెబుదాం టీం ఒకటి ఏర్పాటు చేయాలన్నారు. ఆయా టీముల్లో ఉన్న వారికి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా మండల కార్యాలయాల్లో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ సరిగా పని చేయాలన్నారు. వచ్చిన రిక్వెస్టులను ఫాలోఅప్ చేయడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్కుమార్, డిఆర్ఒ గాయత్రీదేవి, జడ్పీ సిఇఒ భాస్కర్రెడ్డి, ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్రెడ్డి, రవీంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

సర్దుబాటు ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

ట్రూ ఆఫ్, సర్దుబాటు ఛార్జీల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వాలు విరమించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయన్నారు. పలు రకాల పేర్లతో వసూలు చేస్తున్న విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఆర్ఎన్.కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మద్దిలేటి, సిపిఐ నాయకులు పూలమాబు షఫీ, నరసింహ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గడ్డి మందు సీజ్

అనంతపురం డివిజన్ ఎడిఎ ఎం.రవి

ప్రజాశక్తి-అనంతపురం

సీజ్ చేసిన గడ్డి మందు వివరాలను వెల్లడిస్తున్న ఎడిఎ ఎం.రవి

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఆటోలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన నిషేధిత గడ్డి మందును సీజ్ చేసినట్లు ఎడిఎ మీనల రవి తెలిపారు. గురువారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోఉన్న పురుగు మందులు, ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇదే సందర్భంలో ఓ ఆటోలో తరలిస్తున్న ఉత్పత్తులను పరిశీలించగా రాష్ట్రంలో నిషేధించిన రూ.1.04 లక్షలు విలువైన 140 లీటర్ల గ్లైసిల్ గడ్డి మందును గుర్తించి సీజ్ చేయడంతోపాటు ఆటోను కూడా సీజ్ చేసి 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ నిషేధిత యాక్ట్ 1968లోని సెక్షన్ 18, 21, 27 ఐఏ ప్రకారం విచారణ చేసి అమ్మిన వారిపై, రవాణా చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు నాసిరకమైన విత్తనాలు, ఎరువుల, పురుగు మందులు అమ్మినా, కొన్నా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో అనంతపురం మండల వ్యవసాయ అధికారి జె.శశికళ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్ కీర్తిశ్రీకి సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

కీర్తిశ్రీని సన్మానిస్తున్న అధికారులు

2022-23లో ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర టాపర్‌గా నిలిచిన విడపనకల్లు మండలం పులికి గ్రామానికి చెందిన విద్యార్థిని కీర్తిశ్రీని శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి కరణం పుష్పావతి, భీమ్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ కీర్తిశ్రీ మట్టిలో మాణిక్యం అని కొనియాడారు. బ్రహ్మసముద్రంలో అంబేద్కర్ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ హెచ్ఒసి చదువుతూ 1000 మార్కులకు 954 మార్కులు సాధించడం సంతోషకరమన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి తల్లిదండ్రులతోపాటు పుట్టిన ఊరికి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చి ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం కీర్తిశ్రీతోపాటు తండ్రి ధనుంజయకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సర్పంచులు ఉమా శంకర్, రాజశేఖర్, జయసింహ, రఘురాములు, ఎంపిటిసిలు ఓబులేసు, రాజశేఖర్, తిమ్మరాజు, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, నాయకులు కరణం భీమిరెడ్డి, మాధవరెడ్డి, గాజుల వెంకటేశులు, ఆర్టీసీ ఆనందరాజ్, అంపయ్య, సురేష్‌యాదవ్, రామాంజనేయులు, రామూరెడ్డి, జగదీశ్వరరెడ్డి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'పొదుపు' వ్యవస్థ దుర్వినియోగం

ప్రజాశక్తి-రాయదుర్గం

విలేకరులతో మాట్లాడుతున్న వార్డు సభ్యురాలు ప్రశాంతి

విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి కాపు భారతి కారణంగా పొదుపు సంఘాలు, ఆర్‌పి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని మున్సిపల్ వార్డు సభ్యురాలు కురుబ ప్రశాంతి ఆరోపించారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాపు భారతి తన రాజకీయ ప్రయోజనాలకు మున్సిపల్ ఆర్పీలను వాడుకుంటోందన్నారు. ఏ హోదాతో పొదుపు సంఘాలు, ఆర్‌పిలతో వార్డుల్లో సమావేశాలు నిర్వహిస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా ఛైర్‌పర్సన్‌గా కాపు భారతి రక్తదాన కార్యక్రమాలు నిర్వహించుకోవాలే తప్ప ఇలాంటి రాజకీయ సమావేశాలు నిర్వహిచడం, అదికూడా మాజీమంత్రి కాలవ శ్రీనివాసులపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఇంకోసారి పొదుపు సంఘాలు, ఆర్‌పిలతో రాజకీయ సమావేశాలు నిర్వహిస్తే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు భారతి, మున్సిపల్ వార్డు సభ్యురాలు జ్యోతి, మాజీ సభ్యురాళ్లు సుమలత, ఉమా, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను ప్రజలకు చేరువ చేయాలి

ప్రజాశక్తి-నార్పల

మాట్లాడుతున్న జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ

జగనన్న సురక్ష పథకాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువ చేయాలని జిల్లా పరిషత్ వైస్‌ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ సూచించారు. గరువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వాలంటీర్లు, గృహ సారథులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ రాజారెడ్డి, వాలంటరీలు, గృహసారథులు, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలని వినతి

జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మతో మాట్లాడుతున్న మాజీ సైనికులు

అనంతపురం : సైనిక పురం, ప్రధాన రహదారికి మధ్య మిగిలిపోయిన 300 గజాల దూరంలో సీసీ రోడ్డు నిర్మించాలని మాజీ సైనికుల సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు గురువారం జిల్లా పరిషత్‌లోని ఛాంబర్‌లో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను మాజీ సైనిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం సభ్యులు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా సైనికపురంలో సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఇందుకు జడ్పీ ఛైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, కుమారస్వామి, నాగిరెడ్డి, అబ్దుల్ ఖాదర్, రంగారెడ్డి, ఖాజామొద్దీన్, నరసింహులు, మదర్‌సాబ్, నబీరసూల్, వై.ప్రసాద్, మహమ్మద్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

జిల్లాకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఈ) సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎంఎఫ్ఎంఇ కింద 2023-24 ఏడాదికి సంబంధించి 310 ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 142 యూనిట్లను మాత్రమే గుర్తించారని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గుర్తింపులో ఎలాంటి పురోగతి లేదని, వెంటనే జిల్లా రీసోర్స్‌పర్సన్స్ యూనిట్ల గుర్తింపును చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన యూనిట్లకు సంబంధించి ప్రాజెక్ట్ రిపోర్టును తయారు చేయాలని అనంతరం బ్యాంకులకు అందజేయాలన్నారు. మరో మూడు వారాల తర్వాత మళ్లీ సమావేశం నిర్వహిస్తామని,అప్పటిలోగా కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ (ఎల్డీఎం) డి.సత్యరాజు, డిఆర్‌డిఒ పీడీ నరసింహారెడ్డి, డిసిఓ ప్రభాకర్ రెడ్డి, ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్ శాంతి, పిఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, డిపిఓ ప్రభాకర్, డిటిడబ్ల్యూఓ అన్నదొర, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాత, శిశు మరణాలను అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మాతాశిశుమరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జనవరి - ఏప్రిల్ నెలల్లో జరిగిన మాతా,శిశు మరణాలపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు జిల్లాలో 2 మాతా, 2 శిశు మరణాలు సంభవించాయన్నారు. మాతా మరణాల్లో ప్రొటోకాల్ ఫాలో అయ్యారా లేదా అనేది విచారించి పూర్తిస్థాయి రిపోర్టు అందించాలని డిఎంహెచ్ఒని ఆదేశించారు. ఆయా పిహెచ్‌సిల పరిధిలో హైరిస్క్ గర్భిణులను ముందే గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. హైరిస్కు ఉన్నప్పుడు సంబంధిత మెడికల్ అధికారి పరిశీలన చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని, దీన్ని ప్రోత్సహించరాదన్నారు. మరణాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సిఎం జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. కావున వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగినప్పుడు ఇద్దరు పిల్లలు పుట్టాక తల్లిదండ్రులకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. మీ మాట వినకుంటే మెడికల్ అధికారికి చెప్పాలన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎందుకు విఫలం అవుతున్నాయో విచారణ చేసి మహిళల మరణాలు జరగకుండా కాపాడాలన్నారు. పిహెచ్‌సిల పరిధిలో రెండు, మూడు ప్రసవాలు అయినవారు ఎంతమంది ఉన్నారు, నాలుగో గర్భం వరకు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగాయి, ఇంకా ఎంతమందికి జరగాల్సి ఉంది అనే దానిపై మెడికల్ అధికారులతో మాట్లాడి గురువారం నాటికి తనక నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ వీరబ్బాయి, డిఐఓ యుగంధర్, డిసిహెచ్ఎస్ కృష్ణవేణి, 108 డిఎం సంజీవరెడ్డి, డిఎన్ఓ సుజాత, ఎస్ఓ మారుతీప్రసాద్, మెడికల్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

రహదారి నిర్మాణపనులు పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 18వ డివిజన్ పరిధిలో ఉన్న గుల్జార్‌పేటలో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ మహమ్మద్ వసీం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం కోసం నగరంలోని 74 సచివాలయాలకు రూ.14.80 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయా నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ చంద్రశేఖర్, ఎఇ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుత్తి : ఏపీ ఆదర్శ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్.ఉషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల కోసం ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసి, బిసి విద్యార్థులకు సంబంధించి రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలన్నారు. జూలై 2న ప్రవేశ పరీక్ష నిర్వహించి మిగిలిన సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సాకే సతీష్ గురువారం ప్రకటనలో ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 28వ తేదీ బుధవారం ఆదర్శ పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆస్మా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 24వతేదీ లోపు మోడల్ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్రిడిటేషన్ల జారీలో ఉదారంగా వ్యవహరించాలి

రాయదుర్గం : జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేసే విషయంలో సమాచార శాఖ ఉదారంగా వ్యవహరించాలని విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డిని కలిసి కోరారు. అక్రెడిటేషన్లు ఇచ్చే విషయంలో ఉదారంగా ఉండాలని, ప్రత్యేకించి చిన్న పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా వారందరికీ అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించి అధికారులకు తగిన ఆదేశాలు వెంటనే ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రాష్ట్ర కమిషనర్‌తో మాట్లాడుతున్న విప్ కాపు

మున్సిపల్ ఇంజనీర్ సురేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడంలో మున్సిపల్ పాలకవర్గం పూర్తిగా విఫలమైందని టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు విమర్శించారు. పట్టణంలో తాగునీటి సమస్య తీర్చాలని టిడిపి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీర్ సురేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కణేకల్లు సమ్మర్ స్టోరేజీ నుంచి పట్టణానికి నీరు సరఫరా అవుతోన్న ప్రధాన పైప్‌లైన్లు తరచుగా పగిలిపోవడంతో మూడు నుంచి నాలుగు రోజుల పాటు తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేయడంలో అధికారులు విఫలం చెందారన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ఎందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నాసిరకం పైపులు వేయడం వల్లే తరచుగా పైపులు పగిలిపోతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణవాసులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి, మాజీ వైస్ ఛైర్మన్ మహబూబ్ బాషా, బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, మాజీ కౌన్సిలర్లు ఉమా, భారతి, వెంకటేశులు, ఎస్సీ సెల్ మల్లి, రవి, వెంకటేశులు, సిద్ధప్ప, జావీద్, మల్లేషి, తదితరులు పాల్గొన్నారు.

57,465 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ

అనంతపురం : జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ 57,465 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల కోసం 65,138 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఆర్‌బికెలో విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకూ నాణ్యమైన వేరుశనగ కాయలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

గన్నేవారిపల్లిలో 'కంటివెలుగు'

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని గన్నేవారిపల్లిలోని పంచాయతీ సచివాలయం-3 పరిధిలో ఉన్న ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమం కింద గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాలమేరకు 60మందిని పరీక్షించి 11మంది వృద్ధులను ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తాడిపత్రి డివిజన్ జిపిఎం ఒఒ మధుసూదనరాజు తెలిపారు. వీరిని ఆపరేషన్ల కోసం అనంతపురంలోని శారదానగర్‌లో ఉన్న సంచార నేత్ర వైద్యశాలలో జూలై 10న ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య, ఆరోగ్య కార్యకర్త వై.శామ్యూల్, మల్లిక, సీహెచ్‌వో సిహెచ్ పద్మజ, ఆశా వర్కర్ సి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

అధికారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గుత్తి : మండల విద్యాధికారి-2గా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌ను యుటిఎఫ్, ఎస్‌టియు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు, ఎంఇఒ బి.రవినాయక్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అహోబిలేసు, మధు చక్రవర్తి, ఎస్‌టియు నాయకులు ప్రసాద్, శివశంకర్, ఆసీఫ్, రమణ, సురేష్, డేనియల్, ఓబులేసు, ప్రవీణ్‌కుమార్, వన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహాలకు చేయూత

ఆర్థికసాయం అందజేస్తున్న అంజుమన్ కమిటీ సభ్యులు

రాయదుర్గం : పట్టణంలోని 9 మంది నిరుపేద ముస్లిం యువతుల వివాహాల కోసం స్థానిక అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కరికి రూ.7వేల చొప్పున 9 మందికి రూ.63,000 పంపిణీ చేసినట్లు కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ షర్మస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ ఉపాధ్యక్షుడు బాషా, కార్యదర్శి మొహమ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు బాషా, ఖాసిం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకిర్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మృతిచెందిన రవికుమార్

నార్పల : విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని నాయనపల్లి గ్రామానికి చెందిన రవికుమార్ రెండు రోజుల క్రితం తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి ఫీజు వేయడానికి విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వెంటనే స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య శివలక్ష్మి, కుమారుడు రాజేష్ ఉన్నాడు. కాగా మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప, స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

లారీ బోల్తా ... ఇద్దరికి గాయాలు

యాడికి : మండలంలోని జాతీయ రహదారిలో గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూలు జిల్లా డోన్ పట్టణం నుంచి గ్రానైట్ గుండ్లతో తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ వేములపాడు మోడల్ స్కూల్ మధ్య ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి పక్కన ఉన్న గోతిలో పడిపోయింది. దీంతో లారీ డ్రైవర్ మధు ఎడమచేతి మనికట్టు పూర్తిగా విరిగింది. అదేవిధంగా క్లీనర్ రామయ్యకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే గమనించిన మరొక వాహన చోదకులు ఓ ఆటోలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మున్సిపల్ మేనేజర్‌గా బిఎన్. ప్రసాద్

రాయదుర్గం : రాయదుర్గం మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా బిఎన్.ప్రసాద్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకూ పులివెందుల పురపాలక సంఘంలో రెవెన్యూ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన ప్రసాద్ బదిలీపై రాయదుర్గం పురపాలక సంఘం మేనేజర్‌గా నియమితులయ్యారు. చాలాకాలంగా మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండగా సీనియర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జి మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.

నేటి నుంచి రీసర్వే

గార్లదిన్నె : జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా శుక్రవారం నుంచి మండలంలోని ఇల్లూరు గ్రామంలో రీసర్వే ప్రారంభం కానున్నట్లు తహశీల్దార్ ఉషారాణి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఇల్లూరులో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిర్దేశించిన రైతులు తమ పొలాల వద్దకు పట్టాదారు పాసు పుస్తకాలతో వచ్చి సర్వే అధికారులకు సహకరించాలని కోరారు. ఒకవేళ సర్వేకు హాజరు కాలేని రైతులు తమ భూమికి సంబంధించిన అన్ని ఆధారాలనూ రెవెనూ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా డిప్యూటీ తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఉరవకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్ఎస్‌యు మండల అధ్యక్షులు ఖాజా ఆధ్వర్యంలో ఎస్‌కె ప్రభుత్వ పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, బూట్లు పంపిణీ చేయడం లేదన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచడంతో పాటు నాడు-నేడు పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు మండల విద్యార్థి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు లోపు నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

నార్పల : మండలంలోని వివిధ పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనులను ఈ నెలాఖరిలోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ రఫీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం మండలంలోని బొందలవాడ, బి.పప్పూరు, పి.బండ్లపల్లి, గొల్లపల్లి పాఠశాలల్లో చేపట్టిన నాడునేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పనులను నాణ్యతతోపాటు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పనులు చేస్తున్న గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

బొమ్మనహాల్ : ధరల నియంత్రణలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కోరి నాగరాజు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో విపరీతమైన ధరలు పెంచిందన్నారు. తద్వారా పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పెట్రోలు, డీజిల్, కరెంటు, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. అలాగే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు,ఇళ్లు ఇవ్వాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని, పంటలకు మద్దతు ధర కల్పించాలని, ఇసుక, మట్టి మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

చిన్నపిల్లల సర్జన్ డాక్టర్ హరిప్రసాద్

అనంతపురం : హృదయంతో ధ్యానం (హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్) ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించవచ్చని ప్రముఖ పీడియాట్రిక్ సర్జన్, హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ శిక్షకులు డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ఫిజియాలజీ ప్రధాన విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సరళ, పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ శంకర్ నారాయణ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడు రోజుల హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం వల్ల హృదయంలో కలిగే అనవసర ఆలోచనలను నియంత్రించుకోవచ్చన్నారు. అంతేగాకుండా మానసిక ఆనందాన్ని పొందడానికి ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కావున 25 సంవత్సరాలుగా ఈ ధ్యానాన్ని నేను జీవితంలో అలవాటు చేసుకోవడమే కాకుండా అనంత నగరంలోని చాలామంది ప్రజలకు చేరువు చేయడానికి శ్రమిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైద్యులు సరళ, శంకర్‌నారాయణను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఫిజియాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్లు, సహాయకులు మల్లికార్జున, 2022 బ్యాచ్ మెడికోలు పాల్గొన్నారు.

డాక్టర్ హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న వైద్యులు